పాలిటెక్నిక్ కళాశాలకు సూచిక బోర్డు

బెల్లంపల్లి, జూలై 11 : బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎట్టకేలకు గురువారం సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తుంటారు. అన్ని సెట్‌ల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇక్కడ కళాశాలకు సంబంధించిన సూచిక బోర్డు లేకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ఓ వైపు కొత్త బస్టాండ్ మరో వైపు దారి ఉండడంతో తికమకపడేవారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పాతబస్టాండ్ నుంచి కాల్‌టెక్స్ వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు, కళాశాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎట్టకేలకు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.

జోడేఘాట్ బస్సును పునరుద్ధరించాలి

మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్

కెరమెరి, జూలై 11 : జోడేఘాట్ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆసిఫాబాద్ నుంచి కెరమెరి మీదుగా జోడేఘాట్‌కు ఉదయం, సాయంత్రం బస్సు నడిపేవారని గుర్తు చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రానికి వెళ్లే వెసులుబాటు ఉండేదన్నారు. కరోనా కారణంగా బస్సును రద్దు చేసిన అధికారులు, పునరుద్ధరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు బస్సు సౌకర్యం కల్పిస్తే సుమారు 18 గ్రామాల ఆదివాసీ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ డిపో మేనేజర్ స్పందించి, వెంటనే జోడేఘాట్ వరకూ బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని కోరారు. ఆయన వెంట పోరు గ్రామాల యువజన విభాగం అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్, ఆదివాసీ విద్యార్థి సంఘం మండలాధ్యక్షుడు సెడ్మకి తుకారాం, ఆత్రం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇసుక డంపుల సీజ్

ఇసుక డంపులను సీజ్ చేస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్ రూరల్, జూలై 11 : మండలంలోని ముత్తరావుపల్లి, సుందరశాల గ్రామాల్లో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను సీఐ రవీందర్ గురువారం సీజ్ చేశారు. సుమారుగా 300 ట్రాక్టర్ల ఇసుక డంపులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. 10 మంది ట్రాక్టర్ల యాజమానులపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ మల్లికార్జున్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట చెన్నూర్ ఆర్ఐ రంజిత్, వీఆర్ఏ కిరణ్ తదితరులున్నారు.

కిష్టంపేటలో ఆగని ఇసుక దందా..

కిష్టంపేట గ్రామంలో జోరుగా అక్రమంగా ఇసుక దందాను కొనసాగుతున్నది. అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సుద్దాల వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో వివిధ గ్రామాలకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారని అంటున్నారు. ఈ విషయంపై అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఈ దందా జోరుగా కొనసాగిస్తున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దాలి

భీమారం, జూలై 11 : బూర్గుపల్లి జీపీ పరిధిలోని అంగన్‌వాడీని ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రాధా రాథోడ్ అన్నారు. అంగన్‌వాడీ మరమ్మతులకు నిధులు మంజూరవగా, బుధవారం ఆమె పరిశీలించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కింద మంచిర్యాల కలెక్టర్ రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలోల పండ్లు, కూరగాయల మొక్కలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో, టీఏఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

మంచిర్యాల అర్బన్, జూలై 11 : జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా రాధాకృష్ణ పాఠశాల ఎదురుగా జాతీయ రహదారి పక్కన విద్యుత్ స్తంభాన్ని బుధవారం రాత్రి 11:30 గంటల సమయంలో ఓ కారు ఢీట్టింది. ఈ ప్రమాదంలో కారులో నలుగురు యువకులు ఉండగా, ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. స్తంభం మధ్యలోకి విరగడంతో పరిసర ప్రాంతంలో మూడున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే ఈ ప్రమాదంలో పక్కనే పార్కింగ్ చేసి ఉన్న మహేశ్ మోటర్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు శ్రీనివాస్ కారు స్వల్పంగా దెబ్బతిన్నది. స్థానికులు డయల్ 100కు సమాచారం ఇవ్వగా, బ్లూ కోర్ట్ పోలీసులు వచ్చి, వివరాలు సేకరించారు. మరో వైపు ఈ ప్రమదానికి మైనర్ డ్రైవింగే కారణమన్నట్లు తెలిసింది. ఈ విషయానికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా, విద్యుత్ స్తంభం మధ్యలోకి విరిగిపోయిందని, కొత్తడి ఏర్పాటుచేయాల్సి ఉంటుందని వివరించారు. అందుకు అయ్యే ఖర్చును ప్రమాద కారకులే భరిస్తామని తెలిపారని వెల్లడించారు. ప్రమాదంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

మంచిర్యాలటౌన్, జూలై 11 : మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీనగర్ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విద్యార్థినుల తల్లిదండ్రులు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందించారు. పట్టణంలోని రాళ్లవాగు పక్కనే ఉన్న ఈ హాస్టల్‌కు చుట్టుపక్కల పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, రాత్రివేళల్లో విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయని, వర్షాకాలం ప్రారంభం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. దాదాపుగా 400కుపైగా విద్యార్థినులు ఉండే ఈ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాజొద్దీన్, జుబేర్ ఖాన్, రజాక్, ఎస్‌కే మహమ్మద్, గాజి, యూనుస్, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ సమస్యలు పరిష్కరించాలి

హాజీపూర్, జూలై 11 : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల (టీఎన్జీవో) సంఘం హౌసింగ్ సొసైటీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు వినతి పత్రం అందజేశారు. నస్పూర్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు శ్రీహరి పేర్కొనానరు. ఈ కార్యక్రమంలో జిల్లా, మంచిర్యాల యూనిట్ టీఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోటపల్లి, జూలై 11 : పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెన్నూర్ రూరల్ సీఐ సుదాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు. కోటపల్లి కేజీబీవీని సందర్శించిన సీఐ, ఎస్ఐలు పాఠశాల భద్రతపై ప్రత్యేకాధికారి హరితకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు పాఠశాలలోనే ఉంటున్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధచూపాలని, సీసీ కెమెరాలను పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల భద్రతకు సంబంధించి ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

చెన్నూర్ : అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

దాడులకు నిరసనగా జర్నలిస్టుల ధర్నా

చెన్నూర్, జూలై 11 : ఉస్మానియా యూనివర్సిటీలో వార్త సేకరణ కోసం వెళ్లిన జర్నలిస్టుపై పోలీసులు జరిపిన దాడులను జర్నలిస్టులు ఖండిస్తున్నారు. ఆయా చోట్ల ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చెన్నూర్ పట్టణంలోని జర్నలిస్టులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మధునయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టుపై దాడిచేసిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరిగితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణంలోని పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

హాజీపూర్, జూలై 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం ఎదుట టీయూడబ్ల్యూజే హెచ్-143 ఆధ్వర్వంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మాయ మాటలు చెప్పి, అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అరాచక పాలనను కొనసాగిస్తున్నదని ఆరోపించారు. వార్త సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి జర్నలిస్టులపై చిత్తశుద్ధి ఉంటే దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చెట్ల రమేశ్, రేణికుంట్ల శ్రీనివాస్, అంబిలపు శ్రీనివాస్, జిల్లాలోని పలువురు జర్నలిస్టుల పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య..

తాండూర్, జూలై 11 : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరుద్యోగుల, జర్నలిస్టులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ నిరుద్యోగ ఫోరం (టీఎన్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బతుకులు మారుతాయనుకున్నారని, వారి ఆశలు అడియాశలయ్యాయని మండిపడ్డారు. నిరుద్యోగుల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఏడు నెలల్లోనే నిజస్వరూపం తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగుల మీద పాశవిక దాడి కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని దుయ్యబట్టారు. నిరుద్యోగుల డిమాండ్లపై తెలంగాణ నిరుద్యోగ ఫోరం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

మంచిర్యాల అర్బన్ : రాస్తారోకో చేస్తున్న మంచిర్యాల జిల్లా న్యాయవాదులు

న్యాయవాదిపై దాడి అమానుషం

- విధులు బహిష్కరించిన న్యాయవాదులు.. రాస్తారోకో

మంచిర్యాల అర్బన్, జూలై 11 : విధి నిర్వహణలో ఉన్న సిద్ధిపేట న్యాయవాది రవి కుమార్‌పై అక్కడి ఏఎస్ఐ దాడి చేయడం అమానుషమని మంచిర్యాల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరపు జగన్ అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ గురువారం ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తెలంగాణ పిలుపు మేరకు విధులను బహిష్కరించారు. కోర్టు ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, జూలై 11: సిద్ధిపేట పట్టణంలో న్యాయవాదిపై దాడికి నిరసనగా లక్షెట్టిపేట న్యాయస్థానంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రోజు రోజుకూ న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, తక్షణమే ఏఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, రాజారాంరెడ్డి, గాండ్ల సత్యనారాయణ, కొమిరెడ్డి సత్తన్న, అక్కల సుధాకర్, తిరుపతి స్వామి, నళినికాంత్, రవికుమార్, సత్యం గౌడ్, పద్మ, ఉమారాణి, ప్రకాశం, శివశంకర్, వినీత, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి వినతి

సిర్పూర్(యు), జూలై 11 : ఏజెన్సీ ఏరియాలోని ఆయా పోస్టులను గిరిజనులకే కేటాయించాలని గోండి ధర్మ కోయ పుణెం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం ఆనంద్‌రావ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతి పత్రం అందించారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో తమ గోండి భాషను చేర్పించాలని, జనగణనలో తమ ధర్మకాలం కూడా కేటాయించాలని వినవించినట్లు తెలిపారు. ఆయన వెంట ప్రెసిడెంట్ గూడ గ్రామ పటేల్ దుర్వ మోతీరాం, ఖాతిగూడ గ్రామ పటేల్ సెడ్మకి గుణవంత్‌రావ్, గోండి ధర్మ కోయ పుణెం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్నాక కోశేరావ్ ఉన్నారు.

సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలి

భీమారం, జూలై 11 : విద్యార్థులు సోషల్ మీడియాకు అలవాటు కావద్దని, భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసుకోవద్దని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సూచించారు. భీమారం కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, షీ టీం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వేదింపులు, సెల్ ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిమాణాలపై మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో కనకలక్ష్మి, సీఐ మోహన్, సీడబ్ల్యూ ఆనంద్, ఎస్ఐ రాములు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్ టౌన్, జూలై 11 : మహిళల భద్రత-పోలీసుల బాధ్యత కార్యక్రమంలో భాగంగా స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎస్ఐ వెంకటేశ్వర్ రావు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్ రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

భీమారం : అవగాహన కల్పిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

కిష్టాపూర్ కేజీబీవీలో..

జన్నారం, జూలై 11 : మండలంలోని కిష్టాపూర్ కేజీబీవీలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆత్మహత్యలు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ రాజవర్ధన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెన్నెలలో..

నెన్నెల, జూలై 11 : నెన్నెల మండలంలోని చిత్తాపూర్ గిరిజన బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ఎస్ఐ ప్రసాద్ అవగాహన కల్పించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

- డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్

అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్ నాయక్

కాసిపేట, జూలై 11 : పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బీ ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని దేవాపూర్ సమీసంలో గల సల్పాలవాగు ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పర్యాటకులు, పరిసర ప్రాంత ప్రజలు సహకరించాలని గురువారం అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో పర్యాటకులకు పడేసిన ప్లాస్టిక్ ప్లేట్లను తిని వన్య ప్రాణులు జీర్ణ సంబంధ వ్యాధులకు గురవుతాయని, వాటి ప్రాణానికే ప్రమాదకరంగా మారుతున్నదని తెలిపారు. అలాగే మద్యం తాగి ఖాళీ సీసాలు పగల కొట్టడం వల్ల వన్య ప్రాణులు, పర్యాటకుల కాళ్లకు గుచ్చుకొని ప్రమాదాలు జరుగుతున్నాయని, వర్షాకాలంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, పర్యాటక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇప్పటికే ప్లాస్టిక్ రహిత సల్పాల వాగు శివారు ప్రాంతం గురించి తగిన ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేసినట్లు, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

జువెల్లరీ షో ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూవెల్లరీ షో

నస్పూర్, జూలై 11 : జిల్లా కేంద్రంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో గురువారం ఆర్టిస్ట్రీ మేలైన బంగారు ఆభరణాల ప్రదర్శనను చింతల లక్ష్మి, మాలతి ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలు సందర్శించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జైపూర్ : విద్యార్థులతో మొక్కలు నాటుతున్న డివిజనల్ మేనేజర్ శ్రావణి

మొక్కలు నాటాలి

జైపూర్, జులై 11 : పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అని, అందుకు మొక్కలు నాటాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెగడపల్లి అటవీ ప్రాంతంలో గల నీలగిరి ప్లాంటేషన్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కుందారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సునిత, ఫీల్డ్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, తిరుపతి, వాచర్లు శంకర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

'వన మహోత్సవం'పై సమావేశం..

కెరమెరి, జూలై 11 : కెరమెరి ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో 'వన మహోత్సవం'పై తహసీల్దార్ దత్తు ప్రసాదరావు, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్ పాషా సమీక్షా సమావేశం నిర్వహించారు. జీపీల వారీగా నాటేందుకు సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా పారిశుధ్యం సక్రమంగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెరమెరి ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

టీహబ్ సందర్శన

నస్పూర్, జూలై 11 : మంచిర్యాల జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 50 మంది గిరిజన విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని టీ హబ్ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్ర సాంకేతిక విషయాలను తెలుసుకున్నారు. ఈ విజ్ఞాన యాత్రను డీటీడీవో గంగారాం జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో చిరంజీవి, జీవరత్నం, శంకర్, రమేశ్, ధనలక్ష్మి, గంగాభవాని, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయాల ముట్టడి

నస్పూర్ : కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా

నస్పూర్, జూలై 11 : విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. అలాగే రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అభినవ్, తిరుపతి, అరవింద రెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సతీశ్, ఉపాధ్యక్షుడు వసకె సాయి కుమార్, కార్యదర్శి చాపిలే సాయి కృష్ణ, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నితీశ్, జిల్లా కమిటీ సభ్యులు ఎలములే సాయినాథ్, కార్తిక్, భీంరావ్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కోటపల్లి, జూలై 11 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో యాదయ్య సూచించారు. కోటపల్లి మండలంలోని ఎర్రాయిపేట, రాంపూర్, దేవులవాడ, వెలమపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సమర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. డీఈవో వెంట సెక్టోరియల్ ఆఫీసర్ చౌదరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈవో యాదయ్య

నేరాల నిర్మూలనకే కమ్యూనిటీ కాంటాక్ట్

మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, జూలై 11 : నేరాల నిర్మూలనకే కామ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిమడుగు గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకొని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ జీ రాజశేఖర్, ఏసీపీ పరిధిలోని ఎస్ఐలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీఎంవో పుర్క ఉద్దవ్

కెరమెరి, జూలై 11 : కెరమెరి మండలం హట్టి, అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలను గురువాం ఏసీఎంవో పుర్క ఉద్దవ్ తనిఖీ చేశారు. ఈ ఏడాదినుచి పదోతరగతి విద్యార్థులు ఆంగ్ల బోధన ఉంటుందని, ప్రతీ విద్యార్థి మంచిగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని సూచించారు. ఆయన వెట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, బలిరాం, డీఆర్పీ వామన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్క ఫౌండేషన్ ద్వారా చేయూత

బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న కౌన్సిలర్ మహేశ్

చెన్నూర్, జూలై 11: చెన్నూర్ పట్టణంలోని 4వ వార్డు బేతాలవాడకు చెందిన నూకల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి